www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 ఆగస్టు 2025

అరగొండ అర్ధగిరిలో మంత్రి ఆనం

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని అరగొండ అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్ధగిరి ఆలయ నిర్వాహకులు మంత్రి ఆనంకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, రీజినల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, మాజీ చైర్మన్ పైమాగం సుగుణాకర్ రెడ్డి, జిల్లా సహాయ కమిషనర్ చిట్టెమ్మ పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాడుతాం..

- స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి - ప్రతిజ్ఞ చేసిన సిపిఎం-సిపిఐ నాయకులు

చిత్తూరు ఎస్ఈ ఆఫీసు ఎదుట

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరులైన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డిల 25వ వర్ధంతిని స్మరించుకుంటూ గురువారం గిరంపేటలోని ఎస్ఈ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. నాడు పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా మీ పోరాట స్ఫూర్తి అభినందనీయమని, అమరవీరుల త్యాగం, విద్యుత్తు పోరాట స్ఫూర్తితో నేడు విద్యుత్ భారాలకు, స్మార్ట్ మీటర్లకు, సర్దుబాటు ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాడుతామని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ ఛార్జీలు పెంచడం జరిగిందన్నారు. ఆ పెంపుకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేయడంతో ఆ పోరాటాన్ని ఉక్కుపాదంతో అణచడానికి ముళ్లకంచెలు లాఠీచార్జి పోలీసులు కాల్పులు బాష్ప వాయువులు రకరకాల పద్ధతిలో ప్రయోగించి ఉద్యమకారులపై ప్రజలపై ధమనకాండ ప్రయోగించారని, వాటిని లెక్కచేయని ప్రజలు ముల్లకంచెలను తొక్కుకుంటూ ముందుకు వెళ్లడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ మరణించారని తెలిపారు. అయినా పోరాటం ఆగకపోవడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఆ పోరాట ఫలితంగా గత 15 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వాలు విద్యుత్తు చార్జీల జోలికి వెళ్లలేదని, అంత పెద్ద ఎత్తున విద్యుత్ షాక్కు ఆ ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వానికి విద్యుత్ షాక్ బాగా తగిలినప్పటికీ మళ్లీ విద్యుత్ జోలికి పోవడం సిగ్గుచేటు అని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన వారు, స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని పిలుపునిచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రులు అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఏరు దాటే వరకు మల్లన్న.. ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న చందంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మరోసారి ప్రజాగ్రహానికి గురికాకముందే పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు డిమాండ్ చేశారు. లేని పక్షంలో గతంలో విద్యుత్ షాక్ ఏ విధంగా ఇచ్చారో అంతకు రెండింతలు మరోసారి విద్యుత్ షాక్కు ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రమాదేవి, కుమారి, విజయ గౌరీ, రఘు, బాలాజీ, సిఐటియు నాయకులు ఆనంద్, శివకుమార్, మురుగన్, చిట్టిబాబు గోవిందరాజు పాల్గొన్నారు.

- స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని వామపక్షాల నిరసన

పలమనేరు: బషీర్ బాగ్‌లో పోలీసు కాల్పుల్లో అసువులు బాసిన అమరవీరులకు జోహార్లర్పిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక కరెంట్ ఆఫీస్ వద్ద ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మొదలుపెట్టిన విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకిస్తామని, స్మార్టు మీటర్లను అడ్డుకుంటామని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గిరిధర్ గుప్తా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను ఆపాలని, ట్రూ ఆఫ్ ఛార్జీలను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సంజయ్, హారతి, గంగప్ప, లక్ష్మయ్య, సిపిఐ నాయకులు కోదండ రామయ్య, బుర్ర మంజునాథ్, గుర్రప్ప, శంకరప్ప, రమేష్ పాల్గొన్నారు.

పలమనేరులో..

పడకేసిన పారిశుద్ధ్యం

- నిధులు నిల్..పనులు ఫుల్..
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పంచాయతీల్లో అడుగడుగునా సమస్యలు
- పట్టించుకునే వారు కరువు

ప్రజాశక్తి -విజయపురం

స్థానిక మండలంలో పన్నూరు, పన్నూరు హరిజనవాడ, పన్నూరు ఆది ఆంధ్రవాడ గ్రామ ప్రాంతాలలో సరైన నిర్వహణ లేక పారిశుధ్యం పడకేసిం ది. ఎటు చూసినా చెత్తా చెదారంతో పల్లెలు కంపు కొడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే అస్తవ్యస్తంగా మారి పారిశుధ్యం పడకేసినట్లు తెలుస్తోంది. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం చెత్త సేకరణ వాహనాలతో పాటు గ్రీన్ అంబాసిడర్లను నియమించి పల్లెల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసు కున్న ప్పటికీ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమలు లో మాత్రం విఫలమ య్యారని పల్లెల్లో పేరుకుపోయిన చెత్త చెదారం చూస్తేనే తెలుస్తోంది. గ్రీన్ అంబాసిడర్లకు, చెత్త తరలించే వాహన దారులకు వేతనాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో వారు విధులల్లోకి రాకపోవడం వల్ల ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది.

పన్నూరు ఏడి డబ్ల్యూలో కదలని మురుగు

పన్నూరు హెచ్‌డబ్ల్యులో మురుగు కాలువ

దోమలకు నిలయంగా చెత్త

గ్రామ పంచాయతీ కాలనీ గ్రామాలలో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయి దుర్వాసన వెదజల్లుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ అంబాసిడర్లు, వాహన చోదకులకు కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు విధులలోకి రాకపోవడం వల్ల ఈ దుస్థితి నెలకొందని పల్లె ప్రజలు చెబుతున్నారు. ఊటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలలో మురుగు నీరు వెళ్లేందుకు ఎటువంటి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో గృహాలలో నిత్యావసరాల కోసం వినియోగిస్తున్న మురుగు నీరంతా రోడ్లపై చేరి నిల్వ ఉండటం వల్ల ఈగలు, దోమలు చేరి పల్లె ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. గృహాల నుంచి విడుదలైన నీరు ఎక్కడ పల్లంగా ఉంటే అక్కడే నిలవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు గ్రామాలలో మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని, చెత్త వేసేందుకు ఒక పాయింట్ ఏర్పాటు చేసి త్వరితగతిన గ్రీన్ అంబాసిడర్లను సక్రమంగా వేతనాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి

చెత్తాచెదారం తొలగించి సుమారు రెండు నెలలు అవుతోంది. గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. మురుగు కాలువలు లేక రోడ్ల మీదే మురుగు నీరు చేరి అసౌకర్యంగా ఉంటోంది. అధికారులు స్పందించి చెత్త, మురుగు సమస్యలను పరిష్కరించాలి. గ్రీన్ అంబాసిడర్లు వేతనాలు సరిగ్గా ఇవ్వడం లేదు. పంచాయతీ కార్యదర్శిని పెండింగ్ వేతనాలు అడిగి విసిగిపోయాం. వేతనాలు అందక కుటుంబాన్ని పోషించు కోవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా జిల్లా స్థాయిలో అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని అంతే కాకుండా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాల సక్రమంగా ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బిరబిరా కృష్ణమ్మ..

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

- రేపు కుప్పంలో 'జలహారతి'
- నేడు చంద్రబాబు దంపతులు రాక
- 6,400 ఎకరాలకు సాగునీరు
- నాలుగు మండలాలకు తాగునీరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: కుప్పం బ్రాంచి కాల్వలో కృష్ణాజలాలు బిరబిరా ప్రవహిస్తున్నాయి. హంద్రీనీవా కాల్వకు కొత్త కళ తెచ్చింది. శాంతిపురం మండలంలోని పరమసముద్రం చెరువు కృష్ణాజలాలతో తొణికసలాడుతోంది. కృష్ణా జలాలకు హారతి, సారె సమర్పించడానికి రెండు రోజుల పర్యటన కోసం సిఎం చంద్రబాబు సతీసమేతంగా శుక్రవారం కుప్పం చేరుకుంటారు. పరమసముద్రం చెరువు వద్ద శనివారం జలహారతి ఇస్తారు. ఈ చెరువు నుంచి కుప్పం, పలమనేరులోని 110 చెరువులను అనుసంధానం చేయడానికి మార్గం ఏర్పడిందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తుమ్మిసి గ్రామం సమీపంలో కాల్వ వద్ద ప్రత్యేకంగా ఘాట్ ఏర్పాటుచేశారు. దీనికి దగ్గరలోనే 18 అడుగుల చిరస్మరణీయ జ్ఞాపకంగా పైలాన్ నిర్మిస్తున్నారు.కాల్వలో నీటి లోతు పరిశీలించడం, పరిసర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాయలసీమ వరప్రసాదినిగా భావించే హంద్రీనీవా సుజల స్రవంతి కాల్వకు నంద్యాల సమీపంలోని మల్యాల ఎత్తిపోతల వద్ద జులై 17న కృష్ణా జలాలను విడుదల చేశారు. ఆగస్టు 23న కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలం వర్ధికుప్పం వద్దకు కృష్ణాజలాలు చేరాయి. చివరి మజిలీగా పరమసముద్రంలోకి 25వ తేదీ చేరాయి. ప్రస్తుతం ఈ చెరువులు కృష్ణా జలాలతో కళకళలాడుతున్నాయి. సిఎం చంద్రబాబు జలహారతి ఇచ్చే సమయానికి హంద్రీనీవా కాల్వ వెంబడి నియోజకవర్గంలోని 25 ప్రదేశాల్లో రైతులతో పూజలు చేయించడానికి కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ఈ ఏడాది రూ.3,850 కోట్లు వెచ్చించి కృష్ణాజలాలను కుప్పం నియోజకవర్గానికి తెచ్చేందుకు వెచ్చించారు. 110 చెరువులను అనుసంధానం చేసి, 6,400 ఎకరాల ఆయకట్టుకు, నాలుగు మండలాల్లో తాగునీటి అవసరాలకు ఉపయోగించనున్నారు.

సిఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు శుక్రవారం సాయంత్రం 6.20 గంటలకు శాంతిపురం మండలం కడపల్లిలోని స్వగృహానికి చేరుకుంటారు. ఆ రాత్రికి అక్కడే బస చేస్తారు. శనివారం ఉదయం 10 గంటలకు స్వగృహం నుంచి సతీమణి భువనేశ్వరితో కలిసి బస్సులో బయల్దేరి రోడ్డు మార్గంలో కుప్పం మండలం హంద్రీనీవా కాల్వ పరమసముద్రం గ్రామానికి 10.30 గంటలకు చేరుకుంటారు. 10.30 నుంచి 11.15 వరకూ 'జలహారతి' సమర్పిస్తారు. పక్కనే అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుని, బహిరంగసభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పారిశ్రామికవేత్తలు, ఇతర విశిష్టులతో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.45 గంటలకు రోడ్డు మార్గంలో బహిరంగసభ నుంచి పరమసముద్రం గ్రామంలోని హెలిప్యాడ్ వద్దకు 3.55కు చేరుకుని బెంగుళూరుకు 4.40 గంటలకు చేరుకుంటారు. అక్కడనుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోల్ రెండు రోజుల ముందు నుంచే భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛిత ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. కృష్ణాజలాలు కుప్పంకు తీసుకొచ్చిన భగీరధుడు చంద్రబాబునాయుడు జలహారతికి అందరూ హాజరుకావాలని ఎంఎల్‌సి శ్రీకాంత్ కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం, కుప్పం నాలుగు మండలాల్లో 49 కిలోమీటర్ల మేర హంద్రీనీవా సుజలస్రవంతి నీరు పారుతోందని, ఈ కార్యక్రమానికి వృద్దులు, పిల్లలు రావద్దని సూచించారు. ఏడువేల మంది సభకు హాజరుకానున్నారు. కర్పూర హారతులు, కొబ్బరికాయలు, పూలతో కృష్ణాజలాలను స్వాగతించాలని విజ్ఞప్తి చేశారు. పరమసముద్రం వద్ద ముఖ్యమంత్రి పాల్గొనే ఘాట్‌లో భద్రతా చర్యలను, వేదికను గురువారం పరిశీలించారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి: కలెక్టర్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- కుప్పం: అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గం పర్యటనను విజయవంతం చేయాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ మణికంఠ సమావేశం అయ్యారు. ఈనెల 29, 30 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో సీఎం పర్యటనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. అదేవిధంగా ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. కుప్పం మండలం పరమసముద్రం వద్ద హంద్రీనీవా కాలువకు జలహారతి, సీఎం బహిరంగ సభ, వివిధ పారిశ్రామిక ప్రతినిధులతో ఎంఓయూ సమావేశం తదితర కార్యక్రమంలో సీఎం పాల్గొంటారని సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రతిచోట పోలీసు బందోబస్తు: ఎస్పీ

కుప్పం నియోజకవర్గంలో జలహారతికి సంబంధించిన ప్రతి లొకేషన్‌లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని చిత్తూరు ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. కార్యక్రమంలో వృద్ధులు చిన్నపిల్లలను ఆహ్వానించకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ, హార్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డి, సెరికల్చర్ జెడి పద్మావతి, డిపిఓ సుధాకర్ రావు, ఇండస్ట్రీ జిఎం సూరిబాబు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ కొరకు గ్రామసభలు : జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామసభల ద్వారా సబ్ డివిజన్ కొరకు దరఖాస్తులు స్వీకరించబడునని, జాయింటు పట్టాదారులకు వెసులుబాటు కల్పిస్తామని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి గురువారం ఓ ప్రకటన తెలిపారు. జిల్లాలో 2022- 2024 సంవత్సరంలో రీసర్వే పూర్తి అయిన గ్రామాల్లో వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన భూయజమానులకు వారి భూములను విభజన చేయుటకు ప్రభుత్వం నిర్దేశించిన రూ.500ల రుసుంను పూర్తిగా మినహాయించి ఉచితంగా ఈ సేవను పొందుటకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని తెలిపారు. దీనికి కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుం రూ.50లను గ్రామ సచివాలయంలో చెల్లించి సెప్టెంబర్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జాయింటు హక్కుదారులుగా ఉన్న భూములపై తరచూ వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్దిలో అడ్డంకులూ తలెత్తుతున్న నేపథ్యంలో ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన ఆర్జీలను పరిశీలించి కొన్ని జాయింట్ ఎల్.పీ.ఎం.లను పరిష్కరించడం జరిగిందని, జనవరి 2025లో సబ్ డివిజన్ అప్లికేషన్ రుసుంను రూ.500 నుండి రూ.50 కనిష్ట సేవా చార్జిగా తగ్గించడం జరిగిందన్నారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 319 గ్రామాలలో ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందని, ఈ డ్రైవ్‌ను సెప్టెంబర్ 30వ తేదీ వరకూ మాత్రమే వర్తింస్తుందని, అందువలన రైతులు సెప్టెంబర్ 30వ తేదీ లోపల తమ జాయింటు భూములపై వ్యక్తిగత హక్కుల కోసం అవసరమైన దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ సబ్ డివిజను డ్రైవ్ ద్వారా రైతులు తమ భూమిపై పూర్తి హక్కుతో వ్యవహరించగలరని, ప్రభ్యా పథకాల లబ్ధి పొందగలుగుతారని, రిజిస్ట్రేషన్, రుణాలు పొందడం వంటి కార్యకలాపాల్లో సులభతరం అవుతుందన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు ఈనెల 29, 30 తేదీల్లో సంబంధిత గ్రామ సచివాలయంలో పై విషయంగా గ్రామసభ నిర్వహించి జాయింట్ పట్టాదారు వద్ద నుండి ఆన్‌లైన్ సబ్ డివిజన్ కొరకు అర్జీలను స్వీకరిస్తారని తెలిపారు.

నేడు నగరపాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు జరుగుతుందని మేయర్ ఎస్.అముద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక కౌన్సిల్ సమావేశం మందిరంలో జరిగే సమావేశానికి కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

టిడిపి అధ్యక్ష పదవులకు 'క్యూ'

- ఉమ్మడి జిల్లాలో పెద్దసంఖ్యలో ఆశావాహులు
- తలపట్టుకుంటున్న అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్ష పదవులకు ఉమ్మడి జిల్లాలో 'క్యూ' కడుతున్నారు. 'సీనియార్టీ నాకుంది.. పార్టీ కష్టకాలంలో కేసులు బనాయించుకున్నా.. పార్టీ కోసం సొంత డబ్బులు ఖర్చు చేశా.. వలస వచ్చిన వారిని పక్కన పెట్టాలి.. అధ్యక్ష పదవి నాకే ఇవ్వాలి' అంటూ ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వారం రోజుల క్రితం వచ్చిన త్రిమెన్ కమిటీ సభ్యులకు తెగేసి చెప్పారు. చిత్తూరు జిల్లాలో అధ్యక్ష పదవికి 20 మందిపైనే ఉన్నారు. తిరుపతి జిల్లాలో15 మందిపైనే పోటీలో ఉన్నారు. రెండు జిల్లాల పార్లమెంటరీ కమిటీ సమావేశాలకు హాజరైన త్రిమెన్ కమిటీలు అధ్యక్షులను ఏకగ్రీవం చేయకనే వెనుదిరిగాయి. అధ్యక్ష పదవి ఎంపిక బాధ్యత అధినేతకే వదిలేయడంతో చంద్రబాబే స్వయంగా రంగంలోకి దిగే అవకాశం ఉంది.

చిత్తూరు జిల్లాలో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన సిఆర్ రాజన్‌కు ఎన్నికల ముందు ఆ జిల్లా అధ్యక్ష బాధ్యతను అప్పగించారు. 2024 ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీకి సిఆర్ రాజన్ పోటీ పడినప్పటికీ పార్టీ అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవి ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు వన్నెకులక్షత్రియ అభివృద్ధి మండలి రాష్ట్ర ఛైర్మన్‌గా సిఆర్‌రాజన్‌కు పదవిని కట్టబెట్టారు. అధ్యక్ష పదవీకాలం కూడా ముగియడంతో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి కొత్తగా అధ్యక్షుని ఎన్నుకోవాల్సిన ఉంది. ఇటీవల చిత్తూరులో జరిగిన సమావేశానికి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి,



ఎంఎల్‌సి ఆలపాటి రాజేంద్ర, లీడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు హాజరయ్యారు. అయితే 20 మందికి పైగా పోటీలో ఉన్నామని ఆశావాహుల వినతులు వెల్లువెత్తాయి. అధ్యక్ష పదవికి తాము తక్కువ కాదని ఎవరికి వారే తమకున్న అర్హతలను వివరించారు. ప్రస్తుత అధ్యక్షులు సిఆర్ రాజన్ సైతం తననే మళ్లీ కొనసాగించాలని కోరుతున్నారు. మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ కాజూరు బాలాజీ, జడ్‌పి మాజీ ఛైర్మన్ గిర్వాణి భర్త జయప్రకాష్, బంగారుపాళ్యం చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఎన్‌పి ప్రకాష్‌నాయుడు, ఎస్ఆర్ పురానికి చెందిన ఎన్ఆర్ఐ వినోద్, ఐరాలకు చెందిన గురజాల సందీప్, యువగళం పాదయాత్రలో అన్నీ తానై వ్యవహరించిన వసంత్‌కుమార్, ఐరాల మండలానికి చెందిన గిరినాయుడు, మహిళా కోటాలో కార్జాల అరుణ, పాలసముద్రం మాజీ జడ్‌పిటిసి చిట్టిబాబు తదితరులు పోటీలో ఉన్నారు. అయితే ఇంతమంది పోటీలో ఉండడంతో కార్యకర్తలు ఎవరివైపు మొగ్గుచూపుతారో వారినే అధిష్టానం ప్రకటిస్తుందని, అప్పటివరకూ వేచి ఉండాలని త్రిసభ్య కమిటీ చెప్పేసి వెళ్లిపోయింది.

తిరుపతి జిల్లాలో మంగళవారం ఓ ప్రైవేట్ హోటల్లో తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి సవిత, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ హాజరయ్యారు. 15 మంది ఆశావాహులు ఎవరికి వారే పోటీ పడ్డారు. వినతులు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి శాసనసభ్యులు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురగొండ్ల రామకృష్ణ మాత్రం ఇప్పటివరకూ అధ్యక్ష పదవిలో ఉన్న నరసింహయాదవ్‌నే కొనసాగించాలని, కొత్తవారికి అవకాశం ఇస్తే యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్‌ఎ ఎస్సీవీ నాయుడు తానూ బరిలో ఉన్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ యువ రాష్ట్ర నాయకులు, యువగళం పాదయాత్రలో కీలకంగా వ్యవహరించిన శ్రీధర్‌వర్మ సైతం ఆశిస్తున్నారు. ఎక్కువమంది శ్రీధర్‌వర్మకే ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. తిరుపతికి చెందిన సూరా సుధాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, దంపూరి భాస్కర్‌యాదవ్, పుష్పావతి, సతీష్‌రెడ్డిలు రేస్‌లో ఉన్నారు. పలువురు పోటీ ఉండడంతో త్రిమెన్ కమిటీకి ఇక్కడా తలనొప్పిగా మారడంతో అధినేతకే వదిలేశారు.

ఆధునిక ఫిజియోథెరపీ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఏఐఎంఎస్ఆర్ చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పునఃనిర్మించిన ఫిజియోథెరపీ విభాగాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌గోపాల్, జీఎం డాక్టర్ వినోద్, అపోలో ఫిజియోథెరపీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ఫిజియోథెరపీ వృద్ధులకు మాత్రమే కాకుండా ప్రతి వయస్సు వారికీ అవసరమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ సెప్టెంబరు 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, ఆర్థో శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. జనరల్ మేనేజర్ డాక్టర్ వినోద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఫిజియోథెరపీ డిమాండ్ మరింత పెరుగుతుందని, అందువల్ల రోగుల పునరావాస సేవలను విస్తరించడంపై ఏఐఎంఎస్ఆర్ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆ-ఫీసర్ డాక్టర్ రామ్‌గోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ ఈ విభాగం ప్రారంభం చిత్తూరు ప్రజలకు గొప్ప వరమని, వైద్యసేవల నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం గురువారం స్థానిక నీలం సంజీవ రెడ్డి కౌన్సిల్ హాల్‌లో మునిసిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన ప్రశాంతంగా జరిగింది. ఈ సమావేశంలో వివిధ వార్డులకు సంబంధించిన సమస్యలకు పరిష్కార మార్గాలపై కౌన్సిలర్లు చర్చించడం జరిగింది. బస్టాండ్, మార్కెట్ ఏరియాలలో మరుగుదొడ్ల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్వీ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహ ప్రియ పాల్గొన్నారు.

వైద్యులకు ఎన్‌సిడి 4.0పై శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి ఆదేశాల మేరకు ఎన్‌సిడి నోడల్ అధికారి డాక్టర్ గిరి ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి, పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్సీ డాక్టర్లకు, సిహెచ్సి డాక్టర్లకు, ఏరియా ఆసుపత్రి డాక్టర్లకు ఎన్‌సిడి 4.0పై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గిరి మాట్లాడుతూ ఇదివరకు ఎన్సిడి 3.0 సర్వే జరిగింది, ఇప్పుడు ఎన్‌సిడి 4.0లో భాగంగా ప్రతి ఇంటిలో క్వాలిటీగా సర్వే నిర్వహించి కేన్సర్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే చికిత్స ప్రారంభిస్తారని తెలిపారు. కావున కేన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేలా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. శిక్షణ పొందిన డాక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఎన్సిడి 4.0 కార్యక్రమాన్ని క్వాలిటీగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ మమతారాణి, జిల్లా ఎపిడిఎపిడి మియాలజిస్ట్ శ్రీవాణి, డాక్టర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారితే లక్ష్యం : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్త్రీ శక్తి విజయోత్సవ సభను గురువారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు ఒక అన్నగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో మెజారిటీ పథకాలను మహిళల కోసమే, మహిళల పేరుతోనే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని నేడు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తున్నారన్నారు. గత ముఖ్యమంత్రి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి, అప్పులు చేసి వెళ్లారని.. కానీ నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మహిళా సాధికారత కోసం కూటమి ప్రభుత్వం ఇప్పటికే దీపం, తల్లికి వందనం పథకాలను అమలు చేస్తుండగా.. తాజాగా స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. మేయర్ ఎస్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, సురేంద్ర కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనురాధ పాల్గొన్నారు.

శిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎంసిహెచ్ నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో రాష్ట్రంలో శిక్షణ పొందిన టిఓటిలు గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డాక్టర్లకు, ల్యాబ్ టెక్నీషియన్లకు, ఎమ్మెల్ హెచ్‌పి, ఏఎన్ఎం, సూపర్వైజర్లు, స్టాఫ్ నర్స్, ఈ ఆరు కాడర్ల వారికి జిల్లా టిఓటిలుగా పునరుత్పత్తి శిశు సంరక్షణ ఆరోగ్య సేవలపై 2.0 శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ తీసుకున్న వారు తిరిగి జిల్లాలో 1700 మందికి శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణతో గర్భిణులను త్వరితగతిన నమోదు చేసి అన్ని ఆరోగ్యసేవలు అందించడం, బాలింత సేవలు అందించుట, శిశు సంరక్షణ సేవలు అందించుటం యాప్‌లో 2.0 నమోదు చేయడం, అందరికీ అబ ఐడి క్రియేట్ చేయడం వంటి ఈ సేవలను మోనిటరింగ్ చేసి ఎవల్యూ యేషన్ చేయండంతోపాటు లోపాలను రెక్టిఫై చేసి మాత శిశు మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. కావున ఈ శిక్షణను అందరూ అధికారులు వినియోగించుకుని క్షేత్రస్థాయిలో అమలు చేసేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనూష, జార్జి, రోజారాణి, రామ్మోహన్, పిహెచ్‌సిల నుంచి డాక్టర్లు, పారామెడికల్ స్టాఫ్ పాల్గొన్నారు.

కమ్మ అభ్యుదయ సేవా సంఘ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కమ్మ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. స్థానిక లక్ష్మీ నగర్ కాలనీలో కమ్మ అభ్యుదయ సేవా సంఘం కార్యాలయాన్ని ఎమ్మెల్యే గురజాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ అభ్యుదయ సేవా సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం తన వంతుగా రూ.50 లక్షల విరాళాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కమ్మ అభ్యుదయ సేవా సంఘం కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి పేదలను ఆదుకోవడంతోపాటు వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. చెన్నకేశవ నాయుడు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

8366 కొత్త రేషన్ కార్డులు మంజూరు

ప్రజాశక్తి- రొంపిచర్ల: మండలంలో కొత్తగా 8366 స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు అయినట్లు తహసీల్దారు అమర్నాథ్ తెలిపారు. ఆయన గురువారం చౌకదుకాణ డీలర్లు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి బియ్యం కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. చౌక దుకాణం డీలర్లతోపాటు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు అందరూ కలిసి పంపిణీ చేయాలని చెప్పారు. బియ్యం కార్డుల పంపిణీలు ఇలాంటి ఆరోపణలు లేకుండా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.కిరణ్ కుమార్, వీఆర్వోలు సురేంద్ర, పల్లవి, దామోదర్, కార్యదర్శులు వెంకటరమణ, హరిబాబు, శివకుమార్ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం..

ప్రజాశక్తి- కుప్పం: ప్యాలెస్ రోడ్డులోని శ్రీ విద్యాగణపతి సేవ సంఘం సభ్యులు, లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ గణపయ్యను ప్రతిష్టించిన ఆవరణంలో కుప్పం ప్రభుత్వ ఆసుపత్రి, పిఈఎస్ ఆసుపత్రి వారిచే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 31 మంది యువకులు రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారియర్స్ అడ్వైజర్ మహేష్ మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి రక్తదానం చేయడం సంతోసంగా ఉందని వారిని అభినందించారు. అలాగే పాల్గొన్న దాతలకు టీ షర్ట్స్, సర్టిఫికెట్స్ ఇచ్చి వారిని ప్రోత్సహించారు. డాక్టర్లు హరిప్రియ, జనని, నీలిమ, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ వరదరాజులు, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని కురివికుప్పం పంచాయతీ కురివికుప్పం గ్రామానికి చెందిన ఎం.నాథముని రెడ్డి చెన్నై ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం.థామస్‌కి తెలియజేయడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.2,62,900లు మంజూరు చేయడం జరిగింది. గురువారం గంగాధర్ నెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో నాథముని రెడ్డికి ఎమ్మెల్యే చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండలాధ్యక్షులు మోహన్ మురళి, ఏఎంసీ డైరెక్టర్ వరప్రసాద్, సింగిల్ విండో డైరెక్టర్ మనోహర్ నాయుడు, చిరంజీవి నాయుడు, చంద్రబాబు నాయుడు, మహేష్, పాల్గొన్నారు.

సహకార కేంద్ర బ్యాంకు

మొబైల్ ఎటిఎం ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం: కుప్పంలో జిల్లా సహకార కేంద్రం బ్యాంక్ మొబైల్ ఎటిఎంను గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, చిత్తూరు డిసిసి బ్యాంకు చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం ప్రారంభించారు. మొబైల్ ఎటిఎం ప్రారంభంతో గ్రామీణ ప్రజలకు నగదు ఉపసంహరణ, డిజిటల్, బ్యాలెన్స్ చెక్ వంటి సేవలు సులభతరం అవుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో గ్రామీణ, పట్టణ ప్రజలకు బ్యాంకింగ్ సౌకర్యాలు మరింత చేరువ చేయడం కోసం జిల్లా సహకార కేంద్రం బ్యాంకు మొబైల్ ఏటీఎంలో ప్రారంభించినట్లు డిసిసిబి చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సింగల్ విండో చైర్మన్ కృష్ణమూర్తి, కౌన్సిలర్లు జాకీర్, ఎంఆర్ సురేష్, జనసేన నేత నరేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సబ్‌ట్రెజరీ అధికారిగా నూతనంగా బాధితులు చేపట్టిన ప్రసన్న రాణిని సత్కరించే కార్యక్రమం మండల యూటీఎఫ్ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లుల విషయంలో త్వరగతిగా పనులు చేయాలన్నారు. అనంతరం ప్రసన్న రాణికి సత్కారం చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత, మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, సభ్యులు మాధవ నాయుడు, కృష్ణయ్య, శేఖర్ పాల్గొన్నారు.

పలమనేరు సిఐగా మురళీ మోహన్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు అర్బన్ సీఐగా మురళీమోహన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నరసింహారాజును పలు ఆరోపణల నేపథ్యంలో పోలీసు అధికారులు వీఆర్‌కు బదిలీ చేశారు. పలమనేరు రూరల్ సీఐగా ఉన్న మురళీమోహన్‌ను అర్బన్‌కు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలమనేరులో శాంతిభద్రతలు కాపాడుతానని, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : స్థానిక బీవి రెడ్డి కాలనీలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేతుల మీదుగా 30 మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు తెలుగుదేశం నాయకుల లోకేష్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చిత్తూరు నగర మేయర్ అముద, టిడిపి సీనియర్ లీడర్ ఎల్బిఐ లోకేశ్వరరెడ్డి, రెండవ డివిజన్ కార్పొరేటర్ నవీన్ కుమార్ వారి పార్టీలోకి ఆహ్వానించారు.

వర్షాలకు కూలిన ఇళ్లు

ప్రజాశక్తి- రామకుప్పం: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఓ నివాస గృహం కూలిపోయింది. దీంతో భాదితుడు తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. రామకుప్పంలోని బైపాస్ రోడ్డులోని లేట్ వెంకట్రాంరెడ్డి కుమారుడు ఆనందరెడ్డి ఇళ్లు బుధవారం రాత్రి కూలిపోయింది. ఇటీవల పడిన వర్షానికి గోడలు తేమ కారణంగా నీరు కారుతుండటంతో వారు పక్కనే ఉన్న మరో ఇంటికి కాపురం మార్చారు. గురువారం ఉదయం ఉన్నట్టుండి రాతి బండల ఇల్లు కుప్ప కూలిపోయింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో కూలిపోవడం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇళ్లు కూలిపోవడంతో సుమారు నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని ఆనందరెడ్డి వాపోయాడు. తనకు కూలిపోయిన ఇల్లు తప్పా ఎటువంటి ఆస్తిపాస్తులు లేవని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారంతో పాటు పక్కా ఇల్లు నిర్మించుకునేందుకు హౌసింగ్ మంజూరు చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

31లోపు రుణాలు రికవరీ చేయండి

వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఆదేశం

వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహిస్తున్న ఏఎస్‌డబ్ల్యూఓ

ప్రజాశక్తి- సోమల ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొంది ఇంతవరకు బ్యాంకులకు రుణాలకు చెల్లించని లబ్ధిదారుల నుండి ఈనెల 31వ తేదీలోపు రికవరీలు చేసి రుణాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లను ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీరాములు నాయక్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రమైన సోమలలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో చౌడేపల్లి, సోమల, సదుం మండలాలకు సంబంధించిన వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఏఎస్‌డబ్ల్యూఓ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్ కుమార్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణాలను లబ్ధిదారులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన మాట్లాడుతూ సోమల మండలంలో రూ.3,25075లు రుణాలు లబ్ధిదారులు తీసుకోగా ఇప్పటివరకు రూ.1,36,689లు చెల్లించారని, ఇంకా రూ.1,88,386లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. సదుం మండలంలో రూ.5,18,138లు రుణాలు తీసుకోగా రూ.2,10,207లు చెల్లించారని, ఇంకా రూ.3,19,901లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. అలాగే చౌడేపల్లి మండలంలో రూ.29,74,195లు రుణాలు తీసుకొని, ఇప్పటివరకు రూ.6,49,311లు చెల్లించారని, ఇంకా రూ.23,24,884లు రుణాలు చెల్లించాల్సి ఉందన్నారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడి రుణాలు చెల్లించే విధంగా రికవరీ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఓలు రాజేష్, షరీఫ్ బాష, మూడు మండలాలకు సంబంధించిన వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ థామస్

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో 100 మంది పైగా సీఎం సహాయనిది తెప్పించి తన వంతు తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బియ్యం థామస్ తెలిపారు. మండలంలోని మిట్ట దళితవాడలోని 40మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. అదేవిధంగా వేల్కూరు బస్ స్టాప్ దగ్గర మినరల్ వాటర్ ప్లాంట్‌ని థామస్ ప్రారంభించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నియోజకవర్గంలో ఇంటి స్థలం మూడు సెంట్లు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నియోజకవర్గంలో 10వేల మందికి ఇంటి స్థలం ఇచ్చేందుకు అర్హులను కూటమి నాయకులు ద్వారా గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో అనారోగ్య కారణాలతో ఆసుపత్రులు చుట్టూ తిరిగి అప్పుల పాలైన పేదవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలోని పదిమందికి 25 లక్షలు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకేష్, తహశీల్దార్ శ్రీనివాసులు, పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమ నాయుడు , సింగల్ విండో చైర్మన్ మోహన్ నాయుడు, జిల్లా యాదవ సాధికారిక సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షులు స్వామిదాస్, జిల్లా టిడిపి తెలుగు యువత కార్యనిర్వహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, విఆర్ఓ రాధిక పంచాయతీ కార్యదర్శి శివయ్య పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు అందించాలి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతులు, ఖాతాదారుల సమక్షంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బి. కిషోర్ గౌడ్ హాజరయ్యారు. సమావేశంలో డీసీసీ బ్యాంక్ మేనేజర్ జాహ్నవి, సూపర్వైజర్ విజయభాస్కర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలపై వివరణ ఇచ్చారు. బంగారు రుణాలను తక్కువ వడ్డీతో అందిస్తున్నామని, పట్టాదారు పాస్‌పుస్తకాలపై కూడా రుణ సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ బోర్లు కలిగిన వారికి ప్రత్యేక రుణాలను ప్రభుత్వం పథకాల కింద మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సింగిల్ విండో అధ్యక్షులు నాగరాజు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాల మంజూరులో రైతులకు సహకారం అందిస్తామని, సింగిల్ విండో కార్యాలయాన్ని అభివృద్ధి దశలోకి తీసుకెళ్లేందుకు ఖాతాదారులు, రైతుల సహకారం అవసరమని అన్నారు. కిషోర్ గౌడ్ మాట్లాడుతూ, రైతులకు యూరియా, ఫాస్పేట్, క్రిమిసంహారక మందులు, పశువుల కోసం అవసరమైన దాణా, ఎరువులను సింగిల్ విండో కార్యాలయం ద్వారానే అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత సీజన్‌లోనే రైతులకు అన్ని అవసరమైన సదుపాయాలు అందజేస్తామని భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం కూడా రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నదని, వాటిని అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా కార్యక్రమాలు సాగించే దిశగా చర్యలు తీసుకుంటామని, అవినీతి రహిత ప్రభుత్వంగా తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగుతుందని స్పష్టం చేశారు. చైర్మన్ నాగరాజు, త్రిసభ్య కమిటీ సభ్యులు దివాకర్ రెడ్డి, విశ్వనాథ్ గౌడ్, మేనేజర్ వైజి.జాహ్నవి. సూపర్వైజర్ విజయభాస్కర్, టిడిపి మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి పాల్గొన్నారు.

అట్టహాసంగా ఏఎంసి పాలకమండలి ప్రమాణస్వీకారం



ప్రజాశక్తి- కుప్పం: రైతు సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామని కుప్పం ఏఎంసీ చైర్మన్ జిఎం.రాజు పేర్కొన్నారు. కుప్పం ఏఎంసి నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం గురువారం కుప్పంలో అట్టహాసంగా నిర్వహించారు. కుప్పం చెరువు పట్టవత నుండి టిడిపి శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఏఎంసీ చైర్మన్‌గా గుడిపల్లి మాజీ ఎంపీపీ రాజు, వైస్ చైర్మన్‌గా ప్రియా శరవణ తోపాటు 13 మంది పాలకు మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం చంద్రబాబు ఆశయ సాధనకు శక్తి వచన లేకుండా కృషి చేస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని ఏఎంసీ పాలకమండలి చైర్మన్ రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, పికేయం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, టీటీడీ పాలకమండలి సభ్యుడు శాంతారామ్, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజకుమార్ పాల్గొన్నారు.

ఎస్వీ జూ పార్కులో విదేశీ జంతువులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు నూతనంగా విదేశీ జాతులకు సంబంధించిన జంతువులను అధికారులు గుజరాత్ నుండి తీసుకొచ్చారు. రాధేకష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ అందించిన ఈ జంతువులలో ఒక జంట రెడ్-నెక్డ్ వాలాబీలు, ఒక జంట మీర్కాట్స్, ఒక జంట కామన్ మార్మోసెట్స్ కోతులు ఉన్నాయని జూ అధికారులు తెలిపారు. ఈ మూడు రకాల జంతువులను ఎస్వి జూ పార్కులోని "సంజీవని' బ్లాక్‌లో ప్రత్యేకంగా ఉంచామన్నారు. నిర్ధారిత క్వారంటైన్ కాలం పూర్తి అయ్యేవరకు అవి ఇక్కడే ఉంటాయని, ఈ సమయంలో జంతువుల ఆరోగ్యం, అనుకూలత పర్యవేక్షిస్తామన్నారు.ఎస్వి జూ పార్కులో జంతువుల కోసం కొత్త ఆవరణల నిర్మాణానికి రాష్ట్ర అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ గతంలో జరిగిన జంతుశాల బోర్డు సమావేశంలో ఇందుకోసం రూ.55 లక్షల రూపాయలను కేటాయించారని జూక్యురేటర్ సెల్వం తెలిపారు.

తిరుపతిలో శనివారం జాబ్ మేళా

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో 30న శనివారంఉదయం 8 గంటల నుంచి ఎస్విసిసి డిగ్రీ కళాశాల, బాలాజీ కాలనీ, తిరుపతి నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి ఆర్.లోకనాథం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలోని చదువుకుని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ యువతి యువకుల కోసం ఈఎంసి క్లస్టర్, శ్రీ సిటీ , తిరుపతి, చెన్నైలోని 12 బహుళ జాతీయ కంపెనీలలో 400 పైగా ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణత అయిన యువతి యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులు అన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 917993024898, 9988853335 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

క్రైం న్యూస్

డివైడర్‌ను ఢీకొన్న కారు - ఇద్దరు మృతి

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని వంటిల్లు సమీపంలో అదుపు తప్పి కారు డివైడర్ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్ర గాయాలు పాలయ్యారు. పోలీసుల వివరాలు మేరకు.. బెంగళూరు నుంచి నెల్లూరుకు కారులో వెళుతుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొనడంతో ఈప్రమాదం సంభవించింది. ప్రమాదంలో కారు నడుపుతున్న నాగేంద్ర (30) తండ్రి సుబ్బరాయుడు (60) అక్కడికక్కడే మృతి చెందగా.. సుభాషిని, మంగమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇదే ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య గొంతు కోసిన భర్త

భర్త చేతిలో గాయపడ్డ హరిత

ప్రజాశక్తి- సోమల: భార్యాభర్తలు ఘర్షణ పడుతూ ఉన్న సమయంలో ఒక్కసారిగా భార్యపై దాడి చేసి కత్తితో గొంతు కోసి భర్త పరారైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నెల్లిమంద పంచాయతీ తెట్టుపల్లి గ్రామానికి చెందిన రవి ఆచారి, మహేశ్వరి దంపతుల కుమార్తె హరిత (28)ను అనంతపురం కు చెందిన రాజశేఖర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి నాలుగు, మూడు సంవత్సరాల వయసు కలిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడు నెలలుగా దంపతులు ఇద్దరు గొడవలు పడుతూ ఉండగా పది రోజుల క్రితం అమ్మగారి ఊరికి హరిత వచ్చింది. గురువారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో భార్యాభర్త ఇరువురు ఘర్షణపడి గట్టిగా అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు వెళ్లి చూడగా హరిత గొంతు కింద గాయమై తీవ్రరక్తస్రావంతో కిందపడి ఉండడం గుర్తించారు. వెంటనే ఆమెను సోమల ప్రభుత్వ ఆసుపత్రికి ఆపై పీలేరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం తిరుపతి ఆసుపత్రికి తరలించారు. గొంతుకింద కత్తితో కోయడంతో నాలుగు కుట్లు వేశారు. భార్యాభర్తలు ఎందుకు ఏ విషయంగా గొడవపడ్డారో తెలియ రాలేదు. కాగా విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అనారోగ్యంతో టిడిపి కార్యకర్త మృతి

అంత్యక్రియలలో పాల్గొన్న చల్లా బాబు

ప్రజాశక్తి- సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు యశ్వంత్ నాయుడు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. గురువారం యశ్వంత్ అంత్యక్రియలలో పుంగనూరు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు నాయుడు పాల్గొన్నారు. యశ్వంత్ టిడిపి యువ నాయకుడుగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అలాంటి యువ నాయకుడు అనారోగ్యంతో మృతిచెందడం ఎంతో బాధ కలిగించిందని వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా టిడిపి అండగా ఉంటుందని చల్లా బాబు తెలిపారు. అనంతరం అంత్యక్రియలలో పాల్గొని యశ్వంత్ నాయుడు భౌతికకాయాన్ని పాడేను మోసారు. మండల అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన

ప్రజాశక్తి- తవణంపల్లి: స్థానిక జిల్లా ప్రాథమిక పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, కోర్ స్వచ్ఛంద సంస్థ చిత్తూరు ఆధ్వర్యంలో జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్, ఐఈసి క్యాంపింగ్ హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కోర్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. సద్దాం, ఓ ఆర్ డబ్ల్యు ద్రాక్షాయిని సుజాత ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చిన్నచూపు లేకుండా ఎలాగా సమాజంలో కలసి జీవించాలనే విషయాలను వివరించారు. చెడు వ్యసనాలకు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

లంకెల బద్రీనాథ్‌ను సత్కరించిన ఆర్టీవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అమెరికాలోని మూడు శాఖలకు మంత్రిగా పనిచేస్తూ 24 జిల్లాలకు కమిషనర్ గా వ్యవహరిస్తున్న లంకెల బద్రీనాథ్ గురువారం స్థానిక అధికారులను కలిసి మాట్లాడారు. స్వగ్రామానికి వచ్చిన ఆయన తాను ట్రాన్స్ పోర్ట్ ఇంజనీరింగ్ లో స్పెషలైజేషన్ చేశానని ప్రస్తుతం రవాణా శాఖ పరిధిలోనే రహదారులన్నీ ఉన్నాయా లేక నూతన మార్పులు తీసుకు వచ్చారా అని ఆర్టీవో మురళీమోహన్‌ను అడిగారు. ఆర్టీవో రవాణా శాఖ నిర్వహిస్తున్న సేవలను, వాహనాల తనిఖీల విషయాలను మంత్రికి విశదీకరించారు. ఈ సందర్భంగా మంత్రి లంకెల బద్రీనాథ్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, అతికా నాజ్, పరిపాలన అధికారులు విజయ్ కుమార్, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.